సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం | 5 | ఏప్రిల్ | 2025




రాములోరి పెళ్లి సందడి
ఆంధ్రా భద్రాద్రిగా పేరొందిన జి.మామిడాడలో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు.

8లో



పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతం
పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని ఆయిలిండియా ఈడీ సలోమ యండో అన్నారు.

డెల్టాలకు 10,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చర్యలు చేపడుతూ ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో 13వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ), సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) వంటి పథకాలను సద్వినియోగం చేసుకునేలా యువతకు మండల స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. 12వ డీఐఈపీసీ చేసిన తీర్మానాలపై చర్యలను జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్ కమిటీ సభ్యులకు వివరించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకులు శివరాం ప్రసాద్, ఎల్‌డీఎం కేశవవర్మ, సీడీప్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: జిల్లా పరిధిలో బీసీ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి పి.సత్యరమేష్ తెలిపారు. టెట్‌లో అర్హత సాధించి అత్యధిక మార్కులు పొందిన అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తులు అమలాపురంలో జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో అందించాలన్నారు. ఇతర వివరాలకు 70934 01225, 94404 03629 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

రాజమహేంద్రవరం సిటీ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలానికి ఏడు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు డిపో మేనేజర్ షేక్ షబ్నం శుక్రవారం తెలిపారు. 5వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రతి గంటకు ఒక స్పెషల్ బస్సు నడిచేలా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం వీటికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. సీతరాముల కల్యాణం అనంతరం భద్రాచలం నుంచి 6వ తేదీ ఒంటి గంట నుంచి తిరిగి రాజమహేంద్రవరానికి ప్రత్యేక బస్సులు వస్తాయన్నారు.

రొయ్య కొనుగోలుకు మీనమేషాలు

- కొంటాం... కానీ షరతులు వర్తిస్తాయి!
- అత్యవసరమైతేనే రొయ్యల కొనుగోలు
- మూడు రోజుల తరువాత ధర నిర్ణయం
- ప్రస్తుతానికి కౌంట్‌కు ధరలు నిర్ణయించలేదు
- ఆక్వా సంక్షోభంలో ఉన్నా నోరు మెదపని కూటమి సర్కారు
- కరోనా లాక్‌డౌన్ సమయంలోనూ ఇదే పరిస్థితి
- అప్పట్లో వేగంగా స్పందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నాడు కనీస మద్దతు ధరలు ప్రకటించిన వైనం
- ఎఫ్‌డీవోల పర్యవేక్షణలో కొనుగోలుకు ఆదేశం



అమలాపురంలో ఒక కొనుగోలు దుకాణం వద్ద కొనుగోలు లేక దుకాణం వద్దనే ఉన్న వ్యాను, రొయ్యల ట్రేలు

సాక్షి, అమలాపురం: 'రొయ్యలు కొనుగోలు చేస్తాము... కాని షరతులు వర్తిస్తాయి' అన్న చందాన ఉంది ఉమ్మడి తూర్పులోని వనామీ రొయ్యల కొనుగోలు తీరు. తెగుళ్లు, వ్యాధులు బారిన పడుతున్న రొయ్యలను అత్యవసరంగా కొనుగోలు చేయాల్సి ఉంది. లేకుంటే రైతులు మొత్తం పంటను నష్టపోయే పరిస్థితి. ఇటువంటి రొయ్యలను కొనుగోలు చేయాలని రైతులే కొనుగోలుదారుల మీద ఒత్తిడి తెస్తున్నారు. ఇదే అదనుగా అంతర్జాతీయ ఎగుమతిదారులు... స్థానిక కొనుగోలుదారులు కలిసి రైతులను నిలువునా ముంచేందుకు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి తూర్పునకు సంబంధించి అధికారికంగా కాకినాడ జిల్లాలో సుమారు 8 వేల ఎకరాల్లో ఈ సాగు ఉండగా, కోనసీమ జిల్లాలో 15 వేల ఎకరాల్లో సాగవుతోంది. ఈ ఏడాది ఆరంభంలో వనామీ ధరలు రికార్డు స్థాయిలో ఉండడంతో రైతులు పూర్తిస్థాయిలో సాగు చేశారు. ప్రస్తుతం రెండు జిల్లాలో కలిపి సుమారు 60 శాతం చెరువులు అంటే 13,800 ఎకరాల్లో రొయ్యలున్నాయి. వీటిలో సగం రొయ్యలు 100 కౌంట్ దాటి పట్టుబడులకు సిద్ధంగా ఉన్నాయి. ట్రంప్ ప్రభుత్వం ఐదు శాతం ఉన్న భారతీయ ఆహార ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలను 26 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. మనదేశం నుంచి ఎగుమతి అయ్యే వనామీ, సముద్రంలో దొరికే టైగర్, ఇతర రొయ్యలలో 70 శాతానికి పైగా అమెరికాకు ఎగుమతి అవుతున్నాయని చెబుతున్న స్థానిక ఎగుమతిదారులు ఈ వంకతో రొయ్యల కొనుగోలును నిలిపివేశారు. తెగుళ్లు, వ్యాధులు వచ్చిన రొయ్యలను హడావుడిగా పట్టుబడి చేసి కొనుగోలు చేయమని ఒత్తిడి తెస్తే ఎగుమతిదారులు కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. కాని షరతులు మాత్రం వర్తిస్తాయని చెబుతున్నారు. ప్రస్తుతం రొయ్యల కౌంట్‌ను మాత్రమే రాసుకుంటున్నారు. ధర మాత్రం రెండు మూడు రోజుల తరువాత మార్కెట్ పరిస్థితిని బట్టి చెబుతామంటున్నారు. సోమ, మంగళవా



రాలలో ఎగుమతిదారుల సమావేశం అనంతరం ధర నిర్ణయించనున్నారని, ఆ ధరలను ఇప్పుడు కొన్న రొయ్యలకు చెల్లిస్తారని ఎగుమతిదారులు చెబుతుండంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ధరలు తగ్గించేందుకు కుట్ర

వనామీ ధరలు నిర్ణయించకుండా ఇప్పుడున్న ధరకు సైతం కోత పెట్టడం వెనుక ధరలు తగ్గించే కుట్ర ఉందనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. అమెరికాకు ఎగుమతి అవుతున్న రొయ్యలపై సుంకం విధిస్తే ఇప్పుడున్న అమెరికాలో లభ్యమవుతున్న ధరకు అదనంగా 26 శాతం పెంచి అక్కడ అమ్మకాలు చేయాలని, అంతేకాని ఇక్కడ ధర కోత పెట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అమెరికా నుంచి వస్తున్న అధునాతన కార్లపై భారత ప్రభుత్వం 150 శాతం వరకు సుంకం విధిస్తే అక్కడ ఉత్పత్తి అవుతున్న ధరకు ఇక్కడ సుంకం కలిపి విక్రయాలు చేయడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. అంతేకాని అమెరికా నుంచి అధునాత కార్ల ధరలను ఇక్కడ సుంకాలకు అనుగుణంగా తగ్గించడం లేదనే విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. సుంకం విధించిన వెంటనే కొనుగోలు నిలిపి రైతులను ఆందోళనకు గురి చేయడం ద్వారా ధరలు తగ్గించే కుట్ర జరుగుతోందని రైతులు విశ్వసిస్తున్నారు.

ఇదేనా ప్రభుత్వ స్పందన

ఆమెరికా సుంకాలు పెంచకముందే ఆక్వా **రైతులు తాము కొనుగోలు**దారులు వల్ల... **విద్యుత్ అధికారుల తీరు** వల్ల నష్టపోతున్నామని రోడ్డున పడి ఆందోళన చేస్తున్నారు. **అయినా కూటమి ప్రభుత్వం**లో స్పందన లేకుండా పోయింది. ఇప్పుడు అమెరికా సుంకాల వల్ల **మరింత నష్టపోయే పరిస్థితి** వచ్చినా కూడా చంద్రబాబు ప్రభుత్వానికి **చీమ** కుట్టినట్టయినా **లేదు. అంతర్జాతీయ ఎగుమ**తిదారులలో టీడీపీ **అనుకూల సామాజికవర్గా**నికి చెందినవారే అధి**కంగా ఉండడంతో ప్రభుత్వం** నుంచి స్పందన **లేకుండా పోయిందనే విమ**ర్శలు వ్యక్తమవుతు**న్నాయి. కరోనా లాక్‌డౌన్ స**మయంలో అంతర్జా**తీయంగా ఎగుమతులు** నిలిచిపోయాయి. ఇదే **అదనుగా ఎగుమతిదారులు** 100 కౌంట్‌ను **రూ.100 కన్నా తక్కువ** చేసి కొనుగోలు **మొదలు పెట్టారు. దీనిపై** నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేగంగా స్పందించింది. మాజీ సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొనుగోలుపై సమీక్ష జరిగింది. వనామీ రొయ్యలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించడమే కాకుండా మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణలో ఎంఎస్‌పీకి రొయ్యలను కొనుగోలు చేయించారు. లేకుంటే అప్పట్లో వంద కౌంట్ రూ.50 కన్నా తక్కువకు పడిపోయేది. అంతర్జాతీయంగా ఎగుమతులలో ఒడిదొడుకులు ఎదురై ధరలు పతనమైన ప్రతి సందర్భంలోనూ ప్రభుత్వం స్పందించి ఎంఎస్‌పీకి కొనుగోలు చేయించేది. ఆక్వాను ప్రోత్సహించేందుకు ఏకంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ అక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా)ను ఏర్పాటు చేసి ఆక్వా రైతుల సమస్యలకు వేగంగా పరిష్కారం లభించేలా నాటి ప్రభుత్వం కృషి చేసింది.

అనధికార లేఅవుట్లపై కఠిన చర్యలు

అమలాపురం రూరల్: అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఆన్‌లైన్‌లో మాత్రమే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వవలసి ఉంటుందని, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణాలు, పంచాయతీల్లో వేస్తున్న అనధికార లేఅవుట్లపై కఠినచర్యలు తీసుకోవాలని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) వైస్ చైర్ పర్సన్ జాయింటు కలెక్టర్ టి.నిషాంతి కార్యదర్శులను ఆదేశించారు. అముడా పరిధిలో ఉన్న 14 మండలాల్లో 231 గ్రామ పంచాయతీ సెక్రటరీలకు అనధికార లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకోవడం, భవన నిర్మాణ అనుమతుల్లో పాటించ వలసిన నియమ నిబంధనలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం ఈదరపల్లిలో అంబేద్కర్ భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతి పొందిన లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే, సదరు ప్లాట్ల లో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, పార్కులు ఏర్పాట్లు, మొదలగు అన్ని మౌలిక సదుపాయాలు ఉంటాయని తెలిపారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అమలాపురం పట్టణానికి మాస్టర్ ప్లాను ఆమోదించిందని తెలిపారు. డీపీవో ఈ. శాంతలక్ష్మి మాట్లాడారు. అముడా ప్రణాళిక అధికారి సత్యమూర్తి శిక్షణ ఇచ్చారు. 231 పంచాయితీ సెక్రటరీలు, ఏవో చిట్టిబాబు, ఏపీవో ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

8 నుంచి పోషణ్ పఖ్వాడా శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 7వ పోషణ్ పఖ్వాడా కార్యక్రమం ఏప్రిల్ 8 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టినిషాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ వైద్య శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించి సన్నద్ధత పై సమీక్షించారు. ఐసీడీఎస్ పీడీ శాంతి కుమారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదింటికి విద్యుత్ బిల్లు మోత

సఖినేటిపల్లి: కూటమి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీల మోత ఓ పేదింటికి భారం అయింది. శుక్రవారం సదరు పేదింటి మహిళ అడిదల మణి వివరాలు తెలిపింది. మండలంలోని ఉయ్యూరువారి మెరక ప్రగతినగర్‌లో ఓ పూరిల్లులో మణి ఒంటరిగా ఉంటోంది. రోజువారీ కూలీ పనులకు వెళితే గాని పూడగడవని పరిస్థితి ఆమెది. విద్యుత్ మీటర్ నంబరు 1414390662001926 కనెక్షన్‌తో భర్త అడిదల నరసింహస్వామి పేరుతో ఉన్న ఆ ఇంట్లో ఒక బల్బు, ఒక ఫ్యాన్ వాడుతోంది. వీటికి వచ్చిన బిల్లు రూ.1,688.91. ఈ బిల్లును చూసి అవాక్కయిన ఆమెకు ఫైన్ రూపంలో మరో రూ.100 వేసి కట్టాల్సి వచ్చింది. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు తాడి సహదేవ్ సహకారంతో ఆమె అమలాపురం డీఈ డి.రాంబాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో లైన్‌మన్ వచ్చి విద్యుత్ మీటర్‌ను మార్చారు. పాత మీటర్‌ను పరీక్షించడానికి అమలాపురం పంపారు. మీటర్‌లో లోపం ఉన్నట్టు తేలితే ఆమె కట్టిన బిల్లు తిరిగి ఇచ్చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.



ఉయ్యూరువారి మెరకలో పూరిల్లు వద్ద బిల్లుతో మణి

ఎస్సీ వర్గీకరణను చేపట్టడం రాజ్యాంగ విరుద్ధం

- కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజాప్రతినిధుల నిరసన
- మండల సమావేశం నుంచి వాకౌట్

అల్లవరం: ఏపీలో కూటమి ప్రభుత్వం 2011 జనాభా ఆధారంగా ఎస్సీ వర్గీకరణను చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమని సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణను హడావుడిగా చేపట్టిన కూటమి ప్రభుత్వం తీరుని నిరసిస్తూ మండల పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం నుంచి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు వాకౌట్ చేశారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తొలుత ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభించగా సర్పంచ్‌లు సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, సర్పంచ్ దాకారపు చిరంజీవీరావు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ప్రతిపాదించారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదని, కేంద్ర ప్రభుత్వం, లోక్‌సభ, రాజ్యసభలో ప్రవేశ పెట్టి మెజారిటీ



ఎస్సీ వర్గీకరణపై నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

శాతం ఆమోదం తెలిపి, సుప్రీంకోర్టు ద్వారా రాష్ట్రపతికి పంపివలస్సి ఉందని, అలా కాకుండా కూటమి ప్రభుత్వం వ్యవరిస్తోందని అన్నారు. దీంతో సమావేశంలోని అన్ని పార్టీలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు వారికి మద్దతు ప్రకటించారు. అనంతరం ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందించి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. కార్యాలయం ఎదుట కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వర్గీకరణ అంశం 20 ఏళ్ల నాటిదని, 2005లో వర్గీకరణ చేయడం తగదని ఎస్సీలందరూ ఒకటే అని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందని సర్పంచ్ చిరంజీవిరావు అన్నారు. పంజాబ్‌లోని ఓ వ్యక్తి వేసిన కేసు ఆధారంగా ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాలు చేయవచ్చునని ఇటీవల కాలంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పుని ఆసరా చేసుకుని హడావుడిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చాలా దారుణమని తెలిపారు. కేవలం రాజకీయ కోణంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై కేంద్రంలో బీజేపీ, ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ కార్యక్రమాన్ని నిలిపివేయకపోతే న్యాయ పోరాటం చేసి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ సభ్యులు పులుసుగంటి రాజేశ్వరీ, మాకే కృష్ణమూర్తి, ముత్తాబత్తుల రాంబాబు, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, సర్పంచ్‌లు బొమ్మి బాలవేణి, రాకాపు విజయలక్ష్మీ, రొక్కాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆక్వాజోన్‌ను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మండలంలోని 9 గ్రామాల్లో వరి పంట భూములను ఆక్వాసాగుకు ప్రతిపాదించడాన్ని స్థానిక వరి సాగు రైతులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి శుక్రవారం అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల నిర్వహించిన మండల పరిషత్ బడ్జెట్ సర్వసభ్య సమావేశంలోనూ, ఆక్వా జోన్ ప్రతిపాదనపై అభిప్రాయాల సేకరణకై మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లోనూ ఆక్వాజోన్‌కు వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వరిసాగు రైతులు ముక్తకంఠంతో ఆక్వా జోన్‌ను వ్యతిరేకించినట్టు కలెక్టర్‌కు ఎమ్మెల్సీ తోట వివరించారు. వాకతిప్పలో 34.265 ఎకరాలు, టేకిలో 756.54 ఎకరాలు, అంగరలో 252.119, వెదురుమూడిలో 142.79, వడ్లమూరు 64.49, వల్లూరులో 111.638, కాలేరులో 653.874, నల్లూరులో 264.536, కపిలేశ్వరపురంలో 264.536 మొత్తం 9 గ్రామాల్లోని 2,284.162 ఎకరాలను ఆక్వాసాగుకు అనుకూలంగా ఉందంటూ ప్రతిపాదించినట్టు గ్రామ సభల్లో మత్స్యశాఖ అధికారులు ప్రకటించారన్నారు. పచ్చని పొలాలను ఆక్వా చెరువులుగా మార్చాలన్న ఆలోచన రైతులకు లేదన్న విషయాన్ని కలెక్టర్‌కు ఎమ్మెల్సీ తోట వివరించారు. జెడ్పీటీసీ అబ్బు, ఎంపీపీ సత్యవేణి మాట్లాడుతూ తమ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే చెరువులు తవ్వి బడాబాబులు లాభాలు గడిస్తున్నారని, వాటి సమీపంలోని వరిసాగు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆక్వా చెరువులున్న గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోందని గతంలో పలు గ్రామాల ప్రజలు ఆందోళనలను సైతం చేశారని గుర్తు చేశారు. కలెక్టర్‌ను కలిసినవారిలో వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, సర్పంచ్‌లు కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, పెందుర్తి శిరీష, నాయకులు గూటం సత్యనారాయణ, జిత్తుక సూరిబాబు, కట్టా మురళి, ఉమ్మిడిశెట్టి సూరిబాబు ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద ఎమ్మెల్సీ తోట, స్థానిక ప్రజాప్రతినిధులు

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

- 'స్పాట్' సెంటర్‌లోనే మార్కుల పోస్టింగ్
- జిల్లాలో 1.48 లక్షల జవాబు పత్రాల వాల్యుయేషన్
- ఇక అందరి దృష్టి ఫలితాల పైనే
- ఈ నెల 12న వెలువడే అవకాశం

రాయవరం: ఇంటర్మీడియెట్ బోర్డు ఆధ్వర్యంలో జవాబు పత్రాల మూల్యాంకనం శుక్రవారంతో ముగిసింది. గతేడాది వరకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం రాజమహేంద్రవరంలో నిర్వహించగా, జిల్లాల పునర్విభజన అనంతరం గతేడాది తొలిసారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో నిర్వహించారు. ఈ ఏడాది అమలాపురంలోనే నిర్వహించారు. ఈ ఏడాది జవాబు పత్రాల మూల్యాంకనం అనంతరం అదే 'స్పాట్' సెంటర్లో మార్కులను నమోదు చేశారు. మార్చి 7న సంస్కృతం పరీక్షతో ప్రారంభమైన మూల్యాంకన ప్రక్రియ శుక్రవారం రసాయనశాస్త్రం జవాబు పత్రాల వాల్యుయేషన్‌తో ముగిసింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌కు చెందిన 1,48,191 జవాబు పత్రాలను 29 రోజుల పాటు నిరంతరాయంగా మూల్యాంకనం చేశారు. స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్ ఆఫీసర్‌గా ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి వనము సోమశేఖరరావు వ్యవహరించారు.

'స్పాట్'లోనే మార్కుల నమోదు

సాధారణంగా ఇప్పటి వరకు మూల్యాంకనం అనంతరం ఓఎంఆర్ షీట్‌లోని పార్ట్–3 (మార్కులు నమోదు చేసిన షీట్)ను విడదీసి బండిల్స్‌గా ఇంటర్మీడియెట్ బోర్డుకు పంపించేవారు. అక్కడ బోర్డు అధికారుల పర్యవేక్షణలో ఓఎంఆర్ షీట్ పార్ట్–3లో మార్కులను స్కాన్ చేసి, మార్కుల నమోదు అనంతరం ఫలితాలను ప్రకటించేవారు. ఈ ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని తగ్గించేందుకు ఇంటర్ బోర్డు అధికారులు గత ఏడాది తొలిసారిగా ప్రతి స్పాట్ కేంద్రానికి స్కానర్‌ను అందజేశారు. స్కానింగ్ అనంతరం మరొకసారి మార్కుల నమోదును నిర్ధారించడం వలన విద్యార్థికి నష్టం కలగదు. స్కానర్ ద్వారా 'స్పాట్' కేంద్రంలో మూల్యాంకనం చేసిన అనంతరం మార్కుల నమోదును చేపట్టారు. ఈ ప్రక్రియను ఇక్కడే చేపట్టడం ద్వారా ఇంటర్ ఫలితాలను వేగంగా విద్యార్థులకు అందజేసే అవకాశముంటుంది. స్పాట్ ముగియడంతో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల దృష్టి ఫలితాలపై పడింది. ఈ నేపథ్యంలో ఈ నెల 12న ఇంటర్ ఫలితాలు వచ్చే అవకాశముందని అధ్యాపకులు, విద్యార్థులు భావిస్తున్నారు.



అమలాపురంలోని జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం

1.48 లక్షల జవాబు పత్రాల మూల్యాంకనం

ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రానికి వివిధ జిల్లాల నుంచి చేరుకున్న 1,48,191జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి వి.సోమశేఖరరావు నేతత్వంలో మూల్యాంకన ప్రక్రియను చేపట్టారు. ఇంటర్ ఫస్టియర్ అన్ని సబ్జెక్టులు కలిపి 80,934, సెకండియర్ 67,257 ఆన్సర్ స్క్రిప్ట్స్‌ను వాల్యుయేషన్ చేశారు. ఫస్టియర్‌కు సంబంధించి ఇంగ్లీష్ 14,039, తెలుగు 5,598, హిందీ 262, సంస్కృతం 5,210, గణితం 1ఎ.. 9,240; 1బి.. 9,657; వృక్ష శాస్త్రం 2,834, జంతుశాస్త్రం 2699, భౌతిక శాస్త్రం 11,671; రసాయన శాస్త్రం 11,236, అర్థశాస్త్రము 3,235, వాణిజ్య శాస్త్రం 2,239, చరిత్ర 589, పౌరశాస్త్రము 2,425 జవాబు పత్రాలను జిల్లాలో మూల్యాంకనం చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి దిద్దిన పరీక్షా పత్రాలులు...ఇంగ్లిష్ 11,699, తెలుగు 4,160, హిందీ 243, సంస్కృతం 5,010, గణితము ఎ ..7,977, గణితం బి 7,836, వృక్షశాస్త్రము 2,274, జంతుశాస్త్రం 2,100, భౌతికశాస్త్రం 10,182, రసాయన శాస్త్రం 9,765, అర్థశాస్త్రం 2,152, వాణిజ్యశాస్త్రం 1,668, చరిత్ర 394, పౌరశాస్త్రం 1,797 జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది. ఈ ప్రక్రియలో 445 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు పేపర్లను మూల్యాంకనం చేశారు. మూల్యాంకనం చేసిన పేపర్లను 85 మంది స్క్రూటినైజర్లు తనిఖీ చేశారు. మూల్యాంకన ప్రక్రియలో 85 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 21 మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్స్, జెన్1, జెన్2, ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు. స్కానర్ ఇన్‌చార్జ్, కోఆర్డినేటర్స్ మార్కులను పోస్ట్ చేశారు.

పూర్తి పారదర్శకంగా..



ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి పారదర్శకంగా, వేగంగా నిర్వహించాం. జిల్లాల పునర్విభజన అనంతరం అదే జిల్లాలో స్పాట్ నిర్వహించడం వలన అన్ని క్యాడర్లపై ఒత్తిడి తగ్గింది. ఉన్నతాధికారులు నిర్దేశించిన సమయానికి మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేయగలిగాం. మూల్యాంకన ప్రక్రియలో అధ్యాపకులు, సిబ్బంది అందించిన సహకారంతోనే పూర్తి చేయగలిగాం.

– వనము సోమశేఖరరావు, ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడు చైల్డ్ హెల్ప్‌లైన్‌కు అప్పగింత



బాలుడిని చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బందికి అప్పగిస్తున్న జీఆర్‌పీ ఎస్‌ఐ రవికుమార్

కాకినాడ సిటీ: ఇంట్లో తల్లిదండ్రులు మందలించడంతో సికింద్రాబాద్ నుంచి కాకినాడ వచ్చే ట్రైన్ నంబర్ 67446 ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఎం2 కోచ్‌లో 8 ఏళ్ల బాలుడు ఎక్కినట్లు గుర్తించిన టీటీ ఎస్ అచ్యుతరావు ఆ బాలుడిని కాకినాడ ఆర్‌పీఎఫ్ పోలీస్ సిబ్బందికి శుక్రవారం అప్పగించారు. ఈ బాలుడి విషయాన్ని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎన్. విజయలక్ష్మికి వివరించగా ఆమె బాలుడి వివరాలను తెలుసుకున్నారు.

బాలుడి పేరు పి.గణేష్, తండ్రి రాజు, వయస్సు 8 సంవత్సరాలు బలగం పేట, అమీర్‌పేట, హైదరాబాద్ అని చెప్పాడన్నారు. తల్లిదండ్రులు తనను తిట్టడంతో తన తల్లిదండ్రులకు చెప్పకుండా సికింద్రాబాద్‌లో రైలు ఎక్కినట్లు చెప్పాడని స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులు వివరించారు. ఈ బాలుడిని జీఆర్‌పీ ఎస్‌ఐ ఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బందికి సంరక్షణ నిమిత్తం అప్పగించినట్లు తెలిపారు.

రాములోరి పెళ్లి సందడి

- కోదండరాముని కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి
- ఆంధ్రా భద్రాద్రి జి.మామిడాడలో రేపు నిర్వహణ

పెదపూడి: కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని శ్రీ కోదండరాముడి కల్యాణ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. కోరిన కోర్కెలు తీర్చే కోదండరాముడిగా భక్తులు ఆయనను కొలుస్తారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలోని భద్రాద్రి రాముడి ఆలయానికి దీటుగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన ఈ ఆలయంలో తూర్పు, పశ్చిమ దిశల్లో నిర్మించిన గోపురాలు అత్యంత ఎత్తుగా ఉంటాయి.



ప్రత్యేక అలంకరణలో కొలువైన సీతారాముల వారు



ఆకట్టుకునే అద్దాల మందిరం

వాటిపై శిల్పాలను భాగవత, రామాయణాల్లోని అపురూప ఘట్టాలతో మనోహరంగా తీర్చిదిద్దారు. అవి భక్తులను ఆకట్టుకుంటాయి. గొల్లల మామిడాడలో శ్రీ కోదండ రామాలయం కల్యాణ కాంతులను సంతరించుకుంది. ఆదివారం జరిగే సీతారాముల కల్యాణానికి భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. వేల సంఖ్యలో వచ్చే భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ మంచి ముత్యాలను తలంబ్రాలుగా వాడటం విశేషం.

కల్యాణ కొబ్బరి బోండాలు, రామనామ తలంబ్రాలు సిద్ధం



ద్వారంపూడి యువరాజారెడ్డి

జి.మామిడాడ గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి అనే సూక్ష్మ కళాకారుడు కోదండ రామాలయంలో ఆదివారం జరిగే సీతారాముల కల్యాణానికి ప్రత్యేకంగా తయారు చేసిన కొబ్బరి బోండాలు, బియ్యపు గింజలపై మూడు భాషల్లో రాసిన రామ నామ తలంబ్రాలు సిద్ధం చేశారు.

ఆయన మాట్లాడుతూ కల్యాణ కొబ్బరి బోండాలపై శంఖు, చక్ర, నామాలతో కోదండరాముని సీతా, లక్ష్మణ, ఆంజనేయ సహితంగా బోండాలపై రంగురంగుల పాదులు, ముత్యాలు, లేసులు సహాయంతో సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. బియ్యపు గింజలపై ఎలాంటి సూక్ష్మ పరికరాలు వినియోగించకుండా భక్తి శ్రద్ధలతో పార్కర్ పెన్ను సహాయంతో నిష్టగా 1,00,116 గింజలపై తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో రాసి సమర్పిస్తున్నట్లు తెలిపారు. 15 ఏళ్లుగా బియ్యపు గింజలపై ఈ మూడు భాషల్లో రాస్తున్నానన్నారు. ఈ తలంబ్రాలను స్వామి వారి కల్యాణ క్రతువులో సమర్పించనున్నట్లు తెలిపారు. ముక్కోటి ఏకాదశికి ప్రారంభమైన ఈ కార్యక్రమం శ్రీరామనవమి రోజుతో పూర్తవుతుందన్నారు.



శంఖు,చక్ర, సీతా,రామ నామాలతో సుందరంగా ఉన్న కల్యాణ కొబ్బరి బొండాలు



రామనామాలు రాసిన బియ్యపు గింజలు



జి.మామిడాడలో కోదండరామాలయం తూర్పు, పశ్చిమ గోపురాలు

కల్యాణోత్సవ కార్యక్రమాలు వివరాలివీ..

- 6వ తేదీ మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో స్వామివారి కల్యాణం
- 7వ తేదీ సుప్రభాత సేవ, నిత్యోపాసన, డోలు సన్నాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- 8వ తేదీ సుప్రభాత సేవ, నిత్యోపాసన, సహస్రనామార్చన, మధ్యాహ్నం 3.30 గంటలకు సదస్యం
- 9వ తేదీ ఉదయం శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం
- 10వ తేదీ ఉదయం వసంతోత్సవం, చక్ర స్నానం, కంకణ విసర్జనం, పూర్ణాహూతి, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- 11 వ తేది అద్దాల శయన మందిరంలో రాత్రికి ఊయల సేవ, శ్రీ పుష్పయాగం కార్యక్రమాలతో కల్యాణోత్సవాలు ముగిస్తాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- అన్నయ్య దిన కార్యక్రమానికి వెళుతుండగా దుర్ఘటన

అంబాజీపేట: అతి వేగంగా వచ్చిన లారీ ఓ వ్యక్తి నిండుప్రాణాన్ని బలితీసుకుంది. అన్నయ్య దిన కార్యక్రమాన్ని ముగించేందుకు స్కూటీపై కౌశికకు వెళుతున్న ఇద్దరు అన్నదమ్ములను లారీ ఢీ కొట్టింది. అందులో ఒకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంగలకుర్రులో ఈ గత నెల 24న మృతి చెందిన మంగిపూడి సూర్యనారాయణ దిన కార్యక్రమాన్ని మంగిపూడి నాగరాజు, అతని సోదరుడు రామచంద్రరావుల ఇంటి వద్ద నిర్వహించారు. అనంతరం ఆ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు నాగరాజు (64), రామచంద్రరావు (68)స్కూటీపై స్థానికంగా ఉన్న కౌశిక నదికి వెళుతున్నారు. గంగలకుర్రు ప్రాథమిక పాఠశాల సమీపంలో నాలుగు రోడ్ల సెంటర్ వద్దకు వచ్చేసరికి ముక్కామల నుంచి అంబాజీపేట వైపు అతివేగంగా వెళుతున్న లారీ వీరిని బలంగా ఢీ కొట్టింది. దాంతో నాగరాజు, రామచంద్రరావులను 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు.



గంగలకుర్రులో రోడ్డు ప్రమాద దృశ్యం

మార్గమధ్యలో నాగరాజు మృతి చెందగా, రామచంద్రరావు చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై కె.చిరంజీవి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. లారీ డ్రైవర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడని ఎస్సై చెప్పారు. అప్పటి వరకు అన్న దిన కార్యక్రమాన్ని పూర్తి చేసిన అతని సోదరులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడం బంధువులు, స్థానికులను కలచివేసింది. అప్పటికే అన్నదమ్ముల్లో ఒకరిని కోల్పోయి శోకసముద్రంలో ఉన్న మంగిపూడి కుటుంబ సభ్యులు మరో ఇద్దరు మృత్యువాత పడ్డారన్న దుర్వార్త వినడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

సీతమ్మకు కోవా సారె సిద్ధం




కోవాతో తయారు చేసిన వివిధ రకాల స్వీట్లు



కోవాతో స్వీట్లు చేస్తున్న మహిళలు

పి.గన్నవరం: స్థానిక శ్రీపట్టాభి రామస్వామి వారి ఆలయంలో ఆదివారం జరుగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతులు కోవా స్వీట్లతో తయారు చేయిస్తున్న కంత (సారె) భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో శ్రీరాముని తరఫున సీతమ్మవారికి ఈ కంతను సమర్పిస్తారు. వివిధ రకాల ఫలాలు, పుష్పాలు, కూరగాయలు, పంచె, చీర, పర్ణశాల వంటి ఆకృతుల్లో కోవాతో తయారు చేస్తున్న స్వీట్లు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. గత 16 ఏళ్ల నుంచి ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. ఏటా కోవాతో పాటు పలు రకాల పిండి వంటలను తయారు చేయించి సీతమ్మవారికి సమర్పిస్తున్నట్టు సత్యవాణి తెలిపారు. స్థానిక అక్విడెక్టు వద్ద వేంచేసిన శ్రీపట్టాభిరామ స్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. దీనికి 20 రోజుల ముందు నుంచి 100 రకాలకు పైగా కోవాతో స్వీట్లు, పిండి వంటలు తయారు చేయిస్తారు. స్వీట్లు, పిండి వంటల తయారీలో స్థానిక శ్రీరామ్ గార్డెన్స్‌కు చెందిన మహిళా భక్తులు సహకారం అందిస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్

పి.గన్నవరం: మండలంలోని పెదకందాలపాలెం ర్యాంపు నుంచి శుక్రవారం ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా తువ్వ మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలను మైన్స్ ఆర్ఐ బి.సుజాత సీజ్ చేశారు. వీటిని పి.గన్నవరం పోలీస్ స్టేషన్లో అప్పగించారు. స్థానిక అక్విడెక్టు వద్ద మట్టితో వెళ్తున్న టిప్పర్ లారీలను ఆమె తనిఖీ చేశారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్టు సుజాత వివరించారు.



అక్రమంగా తువ్వమట్టిని తరలిస్తున్న టిప్పర్లను సీజ్‌చేసిన అధికారులు

పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతం

ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఈడీ డైరెక్టర్ సలోమ యండో

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఈడీ సలోమ యండో పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో శుక్రవారం ఉదయం అలూమ్ని ఆడిటోరియంలో ఫిపి స్టూడెంట్ చాప్టర్స్ 13వ వార్షిక సమావేశం నిర్వహించారు. యూసీఈకే కెమికల్ ఇంజినీరింగ్, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగాలలోని జేఎన్‌టీయూకే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పెట్రోలియం ఇండస్ట్రీ (ఫిపి) స్టూడెంట్ ఛాప్టర్ ఆధ్వర్యంలో ఇది జరిగింది. జేఎన్‌టీయూకే ఫిపి స్టూడెంట్ చాప్టర్ ఫ్యాకల్టీ అడ్వయిజర్ ప్రొఫెసర్ కేవీ రావు అధ్యక్షత వహించగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఫిపి డైరెక్టర్ (అన్వేషణ మాఉత్పత్తి) దేబ్ జ్యోతి వెలిగించారు. ముఖ్యఅతిథి శ్రీ సలోమ యాండో మాట్లాడుతూ సహజ వనరుల రంగంలో భారత ప్రభుత్వం నిర్దేశించిన నికర జీరో లక్ష్యాలను సాధించడానికి సంబంధిత సంస్థలు తీసుకుంటున్న వివిధ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. భారతదేశం చమురు వినియోగంలో 3వ స్థానంలో ఉందని, ప్రపంచవ్యాప్తంగా 13.2 బిఓఈ (బ్యారెల్ ఆఫ్ ఈక్విలెంట్) వినియోగిస్తుండగా మన దేశంలో 4.7 బిఓఈ వినియోగిస్తున్నామన్నారు. భారతదేశంలో 26 అవక్షేపణా బేసిన్‌లు ఉండగా మొత్తం 3.36 మిలియన్ల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో వ్యాపించి ఉన్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని త్వరలో చమురు నిక్షేపాల అన్వేషణ, అభివృద్ధిపై రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నామన్నారు. దేశంలోని విద్యాసంస్థలతో కలిసి సంయుక్తంగా ఎనర్జీ ఇనీషియేటివ్ ప్రోగ్రామ్స్‌ను చేపట్టనున్నామన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న అతిథులు

నూతన ఆవిష్కరణలు అవసరం

ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ కెమికల్, పెట్రోలియం ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంధన వనరుల ఉత్పత్తి రంగంలోకి రానున్న నేపథ్యంలో రాష్ట్ర, దేశ అవసరాల మేరకు ఇంధన వనరులను ఉత్పత్తి చేసేలా నూతన ఆవిష్కరణలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కాలుష్య రహితమైన ఇంధన వనరులను అందించాల్సిన బాధ్యత పీఈసీఈ విద్యార్థులపై ఉందన్నారు. ఫిపి డైరెక్టర్ దేబ్ అధికారి మాట్లాడుతూ విద్యార్థులను ఇంధన రంగంలో భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దడమే ఫిపి ప్రధాన లక్ష్యమన్నారు. సహజ వనరుల రంగంలో డ్రిల్లింగ్ మరియు అన్వేషణలో ఖచ్చితత్వం అనేది చాలా ముఖ్యమని, దీన్ని దష్టిలో పెట్టుకుని ఫిపి స్టూడెంట్ చాప్టర్‌ల ద్వారా ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. దేశంలోని 11 విద్యాసంస్థల నుంచి వచ్చిన ఫిపి స్టూడెంట్ చాప్టర్‌ల ప్రతినిధులకు అతిథులు ఫిపి ఫ్లాగ్, బ్యాడ్జ్‌ను అందజేసి అభినందించారు. ఫిపి 13వ వార్షిక సమావేశంలో భాగంగా 'భారతదేశంలో అధిక శక్తి సామర్థ్యం, కచ్చితత్వంతో హైడ్రోకార్బన్‌ల అన్వేషణను వేగవంతం చేయడం' అనే నినాదంపై స్టూడెంట్ చాప్టర్లకు నిర్వహించిన పోటీలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీరజ్ సిన్హా, ఓఎన్‌జీసీ ఈస్ట్రన్ ఆఫ్‌షోర్ అసెట్ ఈడీ అసెట్ మేనేజర్ రత్నేష్ కుమార్, ఓఎన్‌జీసీ కావేరీ బేసిన్ మేనేజర్,మాఈడీ శంతను ముఖర్జీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. తదుపరి పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన స్టూడెంట్ చాప్టర్లకు అతిథులు బహుమతులను ప్రదానం చేయడంతో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. జేఎన్‌టీయూకే డైరెక్టర్‌లు ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, ఏ.స్వర్ణకుమారి, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, అక్నూ మాజీ ఉపకులపతి కె.పద్మరాజు, కెమికల్, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగాధిపతులు, అధ్యాపకులు, దేశంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన ఫిపి స్టూడెంట్ చాప్టర్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల గుట్టు రట్టు

- రూ.15.48 లక్షల సొత్తు రికవరీ
- ఎస్పీ కృష్ణారావు వెల్లడి

అమలాపురం టౌన్: వారిద్దరూ పాత నేరగాళ్లు. తాళాలు వేసిన ఇళ్లలో చోరీలు చేయడంలో చేయి తిరిగిన దొంగలు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్షలు అనుభవిస్తున్న సమయంలో ఆ ఇద్దరి దొంగల మధ్య ఏర్పడిన పరిచయం చోరీల స్నేహ బంధంగా మారింది. రాష్ట్రంలో పలు పోలీసు స్టేషన్లలో అనేక చోరీల కేసుల్లో నిందితులైన ఆలమూరు మండలం చింతలూరుకు చెందిన ఉండి శివ సుబ్రహ్మణం, భీమవరానికి చెందిన పందిరి వెంకట నారాయణ కలిసి గత ఫిబ్రవరి నెల 22వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత రావులపాలెం మండలం లక్ష్మీపోలవరంలో దేవగుప్తం వీవ వెంకట సత్య శ్రీనివాస్ అనే బంగారు వ్యాపారి ఇంట్లో భారీ చోరీ చేశారు. రావులపాలెం పోలీసులు ఈ కేసుపై లోతుగా దర్యాప్తు చేస్తున్న సమయంలో ఈ దొంగల ద్వయం చోరీల గుట్టు రట్టు అయింది. ఉండి శివ సుబ్రహ్మణ్యం రావులపాలెం పోలీసులకు చిక్కాడు. రెండో దొంగ పందిరి వెంకట నారాయణ పరారీలో ఉన్నాడు. లక్ష్మీ పోలవరం చోరీకి సంబంధించి పట్టు బడ్డ శివ సుబ్రహ్మణ్యం నుంచి రూ.15.48 లక్షల విలువైన 172.661 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. శివ సుబ్రహ్మణ్యం 20 చోరీ కేసులు, వెంకట నారాయణ 40 చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న పాత నేరస్తులు. ఈ చోరీకి సంబంధించిన వివరాలను ఎస్పీ బి.కృష్ణారావు ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం సీఐ ఎం.శేఖరబాబుతో కలిసి శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరించారు. రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా గల సర్వీస్ రోడ్డులోని ఖాళీ స్థలం వద్ద శివ సుబ్రహ్మణ్యం అనుమానాస్పదంగా సంచరిస్తున్నప్పుడు రావులపాలెం సీఐ ఎం.శేఖర్‌బాబు అతడిని శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. సొత్తును రికవరీ చేసిన క్రైమ్ పార్టీ ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ, రావులపాలెం హెడ్ కానిస్టేబుల్ ఎస్.సత్యనారాయణ, కానిస్టేబుళ్లు పి.త్రిమూర్తులు, సీహెచ్. శ్రీనివాస్, జి.కృష్ణ సాయి, సుంకర బ్లెసన్ జీవన్‌లను ఎస్పీ కృష్ణారావు అభినందించి వారికి రివార్డులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణారావు. చిత్రంలో ఏఎస్పీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్